క్లుప్తంగా

జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలి



అచ్చంపేట రూరల్: జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు కోరారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమలలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నల్లమల ప్రాంతంలో కాగితపు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశ్యానాయక్, శంకర్‌నాయక్, నిర్మల, రాములు, మల్లేష్, సైదులు, నాగరాజు, వెంకటయ్య, మల్లయ్య, శివకుమార్, శ్రీరాములు, గౌస్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



లింగాల: కరాటేతో ఆత్మరక్షణ సాధ్యమని బ్లాక్ బెల్ట్ డాన్–6 గ్రాండ్ మాస్టర్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రవి పేర్కొన్నారు. కరాటే బ్లాక్ బెల్ట్ మాస్టర్ ముఖేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శిక్షణ పొందుతున్న కరాటే విద్యార్థులకు ఆదివారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన పలు రకాల విన్యాసాలను ప్రదర్శించారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన నిహెన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో కరాటేను విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు కరాటేలో రాణించాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన రమాదేవికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.22 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు సందీప్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షులకు ఘన సన్మానం

కల్వకుర్తి రూరల్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయ్యింది. 25 సంవత్సరాలు క్లబ్ అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న వారిని ఎంపిక చేసి ఆదివారం యాదగిరి గుట్ట సమీపంలో సన్మానించారు. వీ108లో కల్వకుర్తి, రాయచూర్, జడ్చర్ల అధ్యక్షులు అర్హత సాధించారు. కల్వకుర్తి క్లబ్ నుంచి జూలూరు రమేష్ బాబు, కల్మచర్ల రమేష్, కల్మచర్ల గోపాల్, కల్వ హరికృష్ణ, గుగ్గిల శంకర్, దాచేపల్లి మనోహర్, చిదిరి శ్రీనివాస్, బాదం రాఘవేందర్ లను ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి మెమెంటోలను బహూకరించారు.

నత్తనడకన ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం



తాడూరు: మండల కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణ పనుల నత్తనడకన కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రజలకు అవగాహన కోసం నమూనా ఇంటిని నిర్మిస్తున్నారు. మూడు నెలల కిందట చేపట్టిన పనులు ఇప్పటికి కొనసాగుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం నమూనా ఇంటిని వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎంగంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లంకాల శ్రీనివాస్ రెడ్డి (72) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఐదుసార్లు సర్పంచ్‌గా సేవలు అందించారు. ఆదివారం స్వగ్రామంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తదితరులతో పాటు గ్రామస్తులు నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గ్రామంలో నివాళులర్పించారు.

శిథిలావస్థలో ప్రభుత్వ ఆస్పత్రి

- ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు



పెచ్చులూడిన పైకప్పు



పెద్ద కొత్తపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. 40 సంవత్సరాల కిందట ఆస్పత్రి భవన నిర్మించారు. ప్రస్తుతం ఆస్పత్రి పైకప్పు సిమెంట్ తెలిపోయి గదుల్లో పెచ్చులు ఊడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. వర్షానికి గోడలు తడిసి కంపు వాసన వస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు.

రోజు 200 మందికి పైగా ఓపీ సేవలు

ఆస్పత్రి పరిధిలో మొత్తం జనాభా 35,350 మంది ఉన్నారు. ఎవరికి ఏఅనారోగ్య సమస్య వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాక తప్పదు. ప్రస్తుతం ప్రతిరోజు 200 వందల మందికి పైగా ఓపీ సేవలు అందిస్తున్నారు. రోగులకు చికిత్స అందిస్తున్న సమయంలోనే పైకప్పు పెచ్చులు ఊడిపడి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. దీంతో వైద్య సేవలు అందించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మందులు కూడా వర్షానికి తడిసిపోతున్నాయి.

ఆరు సబ్‌సెంటర్లు

ఆస్పత్రి పరిధిలో ఆరు సబ్ సెంటర్లు ఉన్నాయి. యాపట్ల, పెద్దకర్పముల, మారెడుమాన్‌దిన్నే, కల్వకొల్, గంట్రావ్‌పల్లి, సబ్‌సెంటర్‌లు ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి ప్రజలు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలివస్తున్నారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. వర్షాకాలంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. రోగుల సరిపడ మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో గోడలు పూర్తిగా తడిగా ఉంటున్నాయి. పైకప్పు పెచ్చులుడుతున్నాయి. ప్రజా ప్రతినిధులు పట్టించుకొని నిధులు మంజూరు చేయించి కొత్త భవన నిర్మాణం చేపట్టాలి.

–మల్లయ్య, పెద్దకొత్తపల్లి

మంత్రి దృష్టికి తీసుకెళ్తాం



నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. త్వరగా నిధుల మంజూరుకు కృషి చేస్తాం.

– సూర్య ప్రతాప్‌గౌడ్, మాజీ ఎంపీపీ

ప్రతిపాదనలు పంపిస్తాం

ఆస్పత్రిలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు భవనాన్ని పరిశీలించారు. రోగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించాం. ఔషధాలు తడుస్తున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ నారాయణ స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దకొత్తపల్లి

రేపు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి ఘటనకు ప్రతికారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత ఆర్మీ పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను, వైమానిక స్థావరాలపై, ఎయిర్‌బేస్‌లను నేలమట్టం చేసి భారత ఆర్మీ సత్తాచాటిందన్నారు. ఈ సందర్భంగా ఆర్మీ విజయం సాధించిన సందర్భంగా పార్టీలకు అతీతంగా తిరంగా ర్యాలీ నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలు, మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా కార్యదర్శి ధన్నోజు నరేష్‌చారి, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బాలింగం గౌడ్

మన్ననూర్: నల్లమల ప్రాంతంలో సోమవారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని అమ్రాబాద్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బాలింగం గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య ముదిరాజ్ కోరారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. దశాబ్దాల కాలంగా వెనుకబాటుకు గురైన ఆదివాసి గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఇందిరా సౌర గిరి జల వికాస పథకం ప్రవేశపెట్టి మాచారం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశ పెట్టడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా సంఘాల సభ్యులు, ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరినారాయణ, నాయకులు గోలి మల్లేష్, తిరుపతయ్య, నిరంజన్, ముక్రం, అశోక్ కుమార్, సురేష్ గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం



పెద్దకొత్తపల్లిలో అసంపూర్తిగా ఉన్న మహిళా సమాఖ్య భవనం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో చేపట్టిన మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణాన్ని కాంట్రాక్టర్ అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. 2014లో అప్పటి మంత్రి డీకే అరుణ మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ పనులను దక్కించుకొని పనుల పూర్తిచేయకుండా చేతులెత్తేశాడు. అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. చేసేదేమి లేక అసంపూర్తిగా ఉన్న భవనంలోనే మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణం పూర్తి చేయాలని సభ్యులు కోరుతున్నారు.

వేసవి శిబిరం.. విద్యార్థులకు వరం



మట్టి బొమ్మల తయారీలో విద్యార్థులు

పాన్‌గల్: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పిల్లలు ఆట, పాటలకు అవధులు ఉండవు. ఐతే సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. పిల్లలు సెల్‌ఫోన్‌లో మునిగితేలుతూ మానసిక కుంగుబాటుతో పాటు కంటి సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెంపొందించేలా చేయడంతో పాటు వ్యక్తిత్వ వికాసం, తెలుగు, గణితం సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం, దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం వారి, వారి పాఠశాలల్లో స్వచ్ఛందంగా వేసవి శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందాన్ని తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవికాలం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రైవేట్ వాహనంలో అధిక సంఖ్యలో తరలివచ్చారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. జాతరకు 15 వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



కల్వకుర్తి రూరల్; మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ తండాలో మేరా మాయాడి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. తండావాసులతో కలిసి ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి విచ్చేసి పూజలు చేశారు. చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజు నాయక్, బోడు నాయక్, బిమ్లా నాయక్, బాలు నాయక్, రాజేందర్, గౌరీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

మన్ననూర్: స్థానిక లింగమయ్య కాలనీలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కొంత కాలంగా హిందు ధర్మాన్ని వ్యాప్తి చేసే క్రమంలో ప్రత్యేకించి నల్లమల ప్రాంత గ్రామాలు, గూడాలు, చెంచుపెంటలలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల నిర్మాణాల కోసం వనవాసి కల్యాణ పరిషత్ కృషి చేస్తుందని పరిషత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ నాయకులు లింగయ్య, మాధవ శర్మ, ఈశ్వర్ కుమార్, సంబు శోభ, వెంకటరమణ, సంబు శ్రీనివాసులు గ్రామ భక్తులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికతతో ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పులిజాలలో బొడ్రాయి, దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆంజనేయస్వామి, శివాలయం, గణపతి, సుబ్రమణ్యస్వామి, నవగ్రహ మంటపం వద్ద ధ్వజ స్తంభాల ప్రతిష్ఠాపనను కనుల పండువగా కొనసాగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరు భక్తిభావం కలిగిఉండాలన్నారు. దైవచింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న మంగ్యానాయక్

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్ కోరారు. ఆదివారం అచ్చంపేటలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నల్లమల ప్రాంత పర్యటనకు వస్తున్న సందర్భంగా శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సీఎం సొంత ప్రాంతం కాబట్టి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమామహేశ్వర , చెన్నకేశవ రిజర్వాయర్ గురించి హంగామా చేసిన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. అటవీ ప్రాంతంలో సహజ సిద్ధమైన వృక్ష సంపద ద్వారా పరిశ్రమలు నెలకొల్పితే ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలాజీ, రేణయ్య, జానకి, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్, శివచంద్ర పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో బీసీ కాలనీలో తాగునీరు వృథాగా పోతోంది. మినీ వాటర్ ట్యాంక్ నిండి రోడ్లపై పారుతోంది. దీంతో కాలనీవాసలు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో తాగునీరు వృథాగా పోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. నీటి వృథాను అరికట్టాలని అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరుతున్నారు.

లోపించిన పారిశుద్ధ్యం



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పముల ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం లోపించింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సీసీ రోడ్డుకు సైడ్ కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో కాలనీవాసులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో ఉన్న సీసీ రోడ్లకు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మించి మురుగు రోడ్లపై ప్రవహించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడొద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడొద్దని డీపీఎంఓ సుకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయ మైదానంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారి స్మారకార్థం అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దిశా క్లస్టర్ మేనేజర్ రమేష్, జిల్లా ఫార్మసీ సూపర్‌వైజర్ సురేష్ కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ శివశంకర్ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టాలి

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలోని బోర్ నుంచి తాగునీటిని అందించే పైపులైన్ పగిలిపోయి 20 రోజులు అవుతున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్‌కు మరమ్మతు చేసి గ్రామంలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.



నిరాహార దీక్షకు ఆచారి మద్దతు



రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న తల్లోజు ఆచారి

ఊర్కొండ: మండలంలోని పరిధిలోని రాచాలపల్లి నుంచి మాదారం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలోని రాచాలపల్లి గేటు వద్ద రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగించారు. బీజేపీ సీనియర్ నాయకులు బొల్గం నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాచాలపల్లి నుంచి మాదారం బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. త్వరగా పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, బీజేపీ నాయకులు దివాకర్ ప్రశాంత్, గ్రామస్తులు జంపులు సత్యనారి నాగయ్య గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మారినా బోర్డుపై పాత పేర్లే..



ప్రస్తుత అధికారుల పేర్లు లేని బోర్డు

తాడూరు: అధికారులు మారినా సమాచార హక్కు చట్టంపై పేర్లు మాత్రం మారడం లేదు. సంవత్సరం కిందట అధికారులు బదిలీ అయిన ఇప్పటికీ వారి పేర్లే దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రికి వచ్చేవారు అధికారుల పేర్లు తెలియక ఇబ్బంది పడుతున్నారు. గతంలో పనిచేసిన డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్ దాదాపు సంవత్సరం కిందట బదిలీపై వెళ్లారు. వైద్యుడిగా విధులు నిర్వర్తించిన కృష్ణయ్య బదిలీకాగా, సీనియర్ అసిస్టెంట్ తిరుపతయ్య పదోన్నతిపై వెళ్లారు. కాని వారి పేర్లు ఇప్పటికి బోర్డుపై ఉండటంతో ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లకు విరుద్ధంగా ఉండటంతో రోగులకు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కమిటీ రెండేళ్ల కిందట రద్దయింది. అయినా బోర్డుపై ఉన్న పేర్లలో ఏ ఒక్కరు లేకపోవడం విడ్డూరం. గతంలో కలెక్టర్ సందర్శించి చివాట్లు పెట్టిన వారి తీరు మారడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బోర్డు మార్చని సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.